# సాక్షి

కథ

## హోతా పద్మినీ దేవి

ఏటి ఒడ్డుకి కొట్టుకొచ్చిన మృతదేహం పైనే అక్కడ గుమిగూడిన జనం చూపులు కేంద్రీకృతమయి వున్నాయి. మృతురాలి బంధువుల రోదనలతో ఆ ప్రదేశం విషాద భరితంగా వుంది.

ఇంతలో పోలీసు జీవు అక్కడకి వచ్చి ఆగింది. జీపు దిగిన ఇన్స్‌పెక్టర్ రవిచంద్రని చూడగానే ఒక నడివయసు వ్యక్తి ఆవేశంగా ముందుకొచ్చాడు.

''ఇన్స్‌పెక్టర్‌గారూ! నా కూతురిని నా అల్లుడే హత్య చేశాడు. వాడిని అరెస్ట్ చేయండి. వాడికి ఉరిశిక్ష పడేలా చెయ్యండి'' అన్నాడు. ఆయన స్వరం ఆక్రందనలా వుంది.



ఆయన్ని రాజగోపాలంగా గుర్తుపట్టాడు రవిచంద్ర. చనిపోయిన యువతి ఆయన కూతురా? అంటే లావణ్య... ఒక్కంగలో వెళ్లి మృతదేహాన్ని పరిశీలనగా చూశాడు. ఎస్! ఆమె లావణ్యే! ఓ గాడ్! అతని కళ్లు చెమర్చాయి. ఆరునెలల కిందట భర్త, అత్తమామలు తనని వరకట్నం కోసం వేధిస్తున్నారని కంప్లయింట్ ఇవ్వడానికి స్టేషన్‌కి వచ్చిన ఈ యువతి ఇప్పుడు శవంగా మారి ఏటి ఒడ్డున పడి వుండడాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు.

సరిగ్గా నెల రోజుల క్రితం రాజగోపాలం తన అల్లుడు వంశీలో పరివర్తన వచ్చిందని, అతనిపై పెట్టిన కేసుని విత్‌డ్రా చేసుకుంటున్నామని చెప్పాడు. ఆ కేసు అలా క్లోజయిపోయింది. వంశీ కూడా స్టేషన్‌కి వచ్చి ఇక ముందు భార్యని బాధ పెట్టనని, ఆమెని ప్రేమగా చూసుకుంటానని, తన వల్ల ఆమెకి ఎలాంటి కష్టనష్టాలు ఎదురవ్వవని హామీ ఇచ్చాడు. ఆ రకంగా లావణ్య కాపురం సెటిలయ్యింది. లావణ్య అత్తవారి ఇంట్లో వుందని, ప్రస్తుతానికి అల్లుడు వల్లగాని, ఆమె అత్తమామల వల్లగాని ఎలాంటి సమస్య లేదని రాజగోపాలం మళ్లీ స్టేషన్‌కి వచ్చి తనతో చెప్పాడు. పర్సనల్ ఇంట్రెస్ట్‌తో ఆ కేసుని డీల్ చేసిన రవిచంద్రకి లావణ్య కాపురం కుదుటపడినందుకు తృప్తిగా అనిపించింది. కాని, నెల కాకముందే ఆమె అనుమానాస్పద పరిస్థితులలో మరణించడం బాధగా వుంది. తన కూతురి వయసున్న లావణ్య...ప్చ్...! తలవిదిలించాడతను. అయితే భర్త వేధింపులు భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ఆమె భర్తే ఆమెని హత్య చేశాడా? అన్న కోణంలో నుంచి కేసు దర్యాప్తు చేయవలసి వుంది. శవాన్ని పోస్టుమార్టంకి తరలించమని సబార్డినేట్స్‌కి చెప్పి వంశీ ఇంటికి పోనిమ్మని జీపు డ్రైవర్‌కి చెప్పాడు.

★★★

పోలీసులని చూడగానే వంశీ తల్లిదండ్రుల ముఖాలలో వ్యక్తమయిన భయాందోళనలు ఇన్స్‌పెక్టర్ రవిచంద్రలో కలిగిన అనుమానాన్ని బలపడేలా చేశాయి.

''వంశీ ఎక్కడ?'' అతనికి తెలియకుండానే స్వరం కరుగ్గా ధ్వనించింది.

''ఆఫీసు పనిమీద చెన్నై వెళ్లాడు సార్!'' భయంగా చెప్పాడు అతని తండ్రి.

వంశీ తల్లి ఏడుపు స్వరంతో చెప్పింది. ''ఇన్స్‌పెక్టర్ గారూ! నా కోడలు నిన్న సాయంకాలమనగా ఎక్కడికో వెళ్లింది. ఇప్పటి వరకు ఇంటికి రాలేదు.''

''ఆమె రాదు..రాలేదు... ఊరవతల ఏటిలో శవమై తేలింది'' అన్నాడు రవిచంద్ర.

''అయ్యో! నా కోడలా! ఎంతపని చేశావే?'' ఏడవడం మొదలు పెట్టింది ఆమె. ఆ ఏడుపు అసహజంగా తోచిందతనికి.

''లావణ్యని గతంలో బాధ పెట్టిన మాట నిజమే. కాని, ఇప్పుడు ఆమెని కన్నకూతురి కంటే ఎక్కువగా చూసుకుంటున్నాము. ఆమె ఆత్మహత్య చేసుకోవలసిన అగత్యం ఏమొచ్చింది?'' గజగజ వణికిపోతూ వంశీ తండ్రి అడిగాడు.

''లావణ్యది హత్యా? ఆత్మహత్యా? అనే విషయం పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చాక తెలుస్తుంది. కానీ, ముందు మీరిద్దరు జీపెక్కండి'' కఠినంగా ధ్వనించిందితని స్వరం.

ఇరుగు పొరుగు వాళ్లు తలోరకంగా వ్యాఖ్యానిస్తుండగా అవమానంతో కుమిలిపోతూ జీపెక్కారు ఇద్దరూ.

★★★

డాక్టర్ కృష్ణంరాజు లావణ్య మృతదేహాన్ని పరిశీలనగా చూశాడు. శవం ముఖం కాస్త ఉబ్బి వుంది. ముఖం, పెదవులు, నీలంగా కనపడుతున్నాయి. ఫెయిర్ కాంప్లెక్షన్ కావడం వలన గోళ్లు, చేతులు కూడా నీలి రంగులోకి మారి వుండడం స్పష్టంగా కనిపిస్తున్నాయి. కనుగుడ్లు పైకి ఉబ్బి వున్నాయి. నాలుక ఉబ్బి బయటకు కనపడుతోంది. దీనిని చూస్తుంటే ఆమె ఊపిరాడక మరణించిందని తెలుస్తోంది.

డాక్టర్ చేతిలోని కత్తి పరపరా ఆమె ఛాతీని కోసింది. నీటిలో మునిగి ప్రాణం పోయిన కేసులలో ఛాతీ కోయగానే లోపల ఉబ్బి పోయివున్న ఊపిరితిత్తులు రెండూ పొడుచుకుంటూ బయటకు వస్తాయి. లావణ్య మృతదేహాన్ని కోసినప్పుడు అతనికి అలాంటిదేమీ కనపడలేదు. నీటిలో మునిగి చనిపోతే నీరు బాగా చేరి ఉబ్బిపోయిన ఊపిరితిత్తులు ఛాతీ మధ్యలో వుండే గుండెని కనపడకుండా మూసేస్తాయి. ఈ కేసులో గుండె కనపడుతోంది. ఊపిరితిత్తులు మామూలు పరిమాణంలో వున్నాయి. రెండు ఊపిరితిత్తులను కోసి ముక్కలు చేసి చూశాడు. చాలా తక్కువగా నీరు కనిపించింది వాటిల్లో. నీటిలో మునిగిపోయిన వ్యక్తి ఊపిరితిత్తుల నుంచి రక్తంలో కలిసిన నీరు చాలా ఎక్కువగా కారుతుంది. ఎంత ఆకస్మాత్తుగా ప్రాణం పోయినా నీటిలో మునిగిపోతున్న వ్యక్తి గట్టున వున్న గడ్డిపరకనైనా ఆత్మరక్షణ కోసం పట్టుకోవడానికి గట్టిగా పిడికిలి బిగిస్తాడు. మనిషి ప్రాణం పోయినా పిడికిలి బిగిసే వుంటుంది. అందులో చిక్కిన మట్టో, గడ్డిపరకో వుండే వుంటాయి. కాని లావణ్య పిడికిళ్లు బిగిసి లేవు.

అంటే లావణ్యది ఆత్మహత్య కాదు. ఎవరైనా హత్య చేసి వుండాలి. ఈ ఆలోచన రాగానే డాక్టరు కృష్ణంరాజు ఆమె శవాన్ని బోర్లా పడేసి చూసాడు. ఆమె వీపంతా రాళ్లు, రప్పలతో గీరుకుపోయి వుంది. మెడ దగ్గర పరీక్షించగా అక్కడ చర్మం కమిలిపోయి వుంది. మెడ దగ్గర జాగ్రత్తగా కోసి చూశాడు. చర్మం కింద రక్తనాళాలు చిట్లి కండరాలు నలిగి వున్నాయి. లావణ్య నీటిలో మునిగి చనిపోలేదు. ఎవరో ఆమె పీక నులిమి హత్య చేసిన తరువాత ఆమె మృతదేహాన్ని ఈడ్చుకుంటూ వెళ్లి నీటిలో తోసేసారు.

★★★

పోస్టుమార్టం నివేదిక చదివిన రవిచంద్రకి వంశీపై అనుమానం మరింత బలపడింది. మూడు రోజుల కిందట చెన్నై నుంచి ఊళ్లోకి వచ్చిన వంశీని అరెస్ట్ చేసాడు. అతను లావణ్య మరణానికి బాధపడుతూ, తనే పాపం ఎరుగనని అంటున్నాడు. థర్డ్‌డిగ్రీ ఉపయోగించయినా వంశీ చేత నిజం కక్కించాలని లాఠీ అందుకొని వంశీ వున్న సెల్‌లోకి వెళ్లబోతుండగా, ఒక వ్యక్తి పోలీస్ స్టేషన్‌కి వచ్చాడు.

''దండాలండయ్య!'' వస్తూనే చేతులు జోడించాడు. అతని వేషభాషలని బట్టి అతను కాయకష్టం చేసి బతుకుతున్న వాడని అర్థమయింది రవిచంద్రకి.

''ఎవర్నువ్వు?''

''నాపేరు ఈరాసామి. అండి. మేకల్ని మేపుతుంటాను.''

''ఏంకావాలి?''

''నాలుగు దినాల క్రితం ఏటిలో సచ్చిపడి వున్న అమ్మాయిని చంపిందెవరో నాకు తెలుసు''

నిటారుగా అయ్యాడు రవిచంద్ర.

''చెప్పు.. ఎవరు?''

''నేనా రోజు నాయుడుగారి తోట దగ్గర సరిహద్దుకవతల వున్న కొండదగ్గర మేకల్ని మేపుతుండగా తోటలోకి ఒక జంట వచ్చారు. జంటలో ఆడ మడిసి సచ్చిపోయినావిడ. మగమణిసి...'' అతను చెప్పేది పూర్తికాకుండానే మధ్యలోనే అడ్డపడి..'అతనేనా?'' అని అడిగాడు రవిచంద్ర సెల్‌లో దీనవదనంతో కూర్చుని వున్న వంశీని చూపిస్తూ...

క్షణకాలం పరకాయించి చూసి ''ఈయన కాదు. ఆ మగతను ఎత్తుగా, ఎర్రగా, బలంగా వున్నాడు. కనుబొమ్మ పక్కన ఉలిపిరి కాయ వుంది. ఆళ్లిద్దరూ ఏదో విషయంలో తగూ పడ్డారు. అతను సెప్పేదానికి ఆవిడ ఒప్పుకోలేదు. మగతను నిన్ను బతకనివ్వనే అని బూతులు తిడుతూ ఆవిడ పీక నొక్కేసాడు. ఆవిడ గిలగిల తన్నుకొని కాస్సేపటికి కదలకుండా వుండిపోయింది. శవాన్ని ఈడ్చుకుంటూ వెళ్లి ఏట్లోకి తోసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.''

''ఇదంతా నువ్వు సినిమా చూస్తున్నట్లు చూసావా? ఆ అమ్మాయిని రక్షించాలని ప్రయత్నించలేదా?'అసహనంగా అడిగాడు రవిచంద్ర.

భయమేసిందండీ. పొదలచాటునే వుండిపోయాను. ఆ అమ్మాయి సచ్చిపోయిన కాడినుంచి మీ కాడికొచ్చి నిజం చెప్పాలనుకుంటున్నా భయం!

చదువుకున్న వాళ్లే సాక్ష్యం చెప్పడానికి భయపడుతుండగా సామాన్య ప్రజానీకం పోలీసులు, కోర్టు అంటే భయపడడంలో అసహజమేముంది? అని నిట్టూర్చి...వీరాస్వామి! హంతకుడిని ఇప్పుడు చూసినా గుర్తుపట్టగలవు కదా? అని అడిగాడు.

ఆయ్! మరో పది రోజుల తర్వాతయినా గుర్తుపడతానండి.

★★★

ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర లావణ్య తండ్రి రాజగో

పొలం దగ్గరికి వెళ్లాడు.

"లావణ్యకి ఇంకెవరైనా మగవారితో పరిచయం కాని, స్నేహం కాని వున్నాయా?"

"ఎందుకలా అడుగుతున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడాయన.

రవిచంద్ర వీరాస్వామి చెప్పిందంతా చెప్పాడు.

వెంటనే ఆయన ముఖం పాలిపోయింది. "ఆ వ్యక్తి వర్ణించిన పోలికలు ప్రదీప్‌కి సరిపోతాయి. ప్రదీప్ తండ్రికి, నాకు చాలా రోజులుగా స్నేహ సంబంధాలున్నాయి. ప్రదీప్ కారు మెకానిక్‌గా పనిచేస్తాడు. మొదట్లో లావణ్యని ప్రదీప్‌కిచ్చి పెళ్లి చేయాలనుకున్నాను. నా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుండేది. ప్రదీప్ లావణ్యని ఇష్టపడుతున్నాడు కాబట్టి, తక్కువ కట్నానికే నా కూతురి పెళ్లి చేయాలనుకున్నాను. ఇరవై ఏళ్ల క్రితం ఊరి శివార్లలో చవకగా నేను కొన్న భూమి ధరకి రెక్కలు రావడంతో నా జాతకం మారిపోయింది. అనుకోకుండా వచ్చిన సిరితో నా ఆలోచనలు మారిపోయాయి. లావణ్యకి రెండు లక్షలు కట్నమిచ్చి మంచి ఉద్యోగంలో వున్న వంశీకిచ్చి పెళ్లి చేసాను. పెళ్లయ్యాక అత్తవారింట్లో కొన్ని నెలలు లావణ్య సుఖంగానే వుంది. తరువాత అత్తమామలు, భర్త ఆమెనింకా కట్నం తెమ్మని వేధించసాగారు. లావణ్యని ప్రదీప్‌కిచ్చి పెళ్లి చేస్తే ఆమె సుఖంగా వుండేదని, ఐశ్వర్యం తెచ్చిన మత్తులో ప్రదీప్‌ని దూరం చేసుకున్నందుకు నాలో పశ్చాత్తాపం మొదలయింది. లావణ్య సంసారం సజావుగా లేదని తెలిసిన ప్రదీప్‌లో మళ్లీ ఆమెపై ఆశలు చిగురించాయి. వంశీకి విడాకులు ఇప్పించమని, ఆమెని పెళ్లి చేసుకుంటానని అడిగాడు. వంశీపై ఆగ్రహావేశాలతో రగిలిపోతున్న నేను అందుకు అంగీకరించాను. భర్త పెట్టే బాధలని భరించలేక లావణ్య పుట్టిల్లు చేరి నా సహకారంతో అత్తింటి వారిపై పోలీసు కేసు పెట్టింది. ప్రదీప్ నా ముందుంచిన ప్రతిపాదనని ఆమెకి చెప్పాను. ఆమె పునర్వివాహానికి అంగీకరించలేదు. మెల్లిగా నచ్చచెప్పాలనుకున్నాను. ఈలోగా పోలీస్ కేసుతో వంశీ కుటుంబీకులు బెదిరిపోయారు. మేం వ్యవహారాన్ని పోలీసుల దాకా తీసుకెళతానని వాళ్లు ఊహించలేదు. వంశీ కాళ్లబేరానికి వచ్చాడు. లావణ్యకి తన వల్ల కానీ, తన వాళ్ల వల్ల కాని ఎలాంటి కష్టనష్టాలు ఎదురవ్వవని, ఆమెని ప్రేమగా చూసుకుంటానని హామీ ఇవ్వడంతో కేసు విత్‌డ్రా చేసుకున్నాను. తిరిగి కాపురానికి వెళ్లిన లావణ్య తనని భర్త ప్రేమగా చూసుకుంటున్నాడని, సంతోషంగా వున్నానని ఫోన్‌లో మాకు చెపుతుండేది. వంశీలో వచ్చిన పరివర్తన తాత్కాలికమేమోనని, అతని నుంచి లావణ్యకి ఎప్పుడు ఏ ఆపద వస్తుందోనని భయం నన్ను వీడలేదు. కానీ, ఆపద ప్రదీప్ నుంచి వస్తుందని, వాడింత దారుణానికి పాల్పడతాడని కలలో కూడా అనుకోలేదు రాజగోపాలం స్వరం విచలితంగా వుంది.

★★★

వీరస్వామి ప్రదీప్‌ని హంతకుడిగా గుర్తుపట్టడంతో అరెస్టయిన ప్రదీప్ గతాన్ని గుర్తుచేసుకుంటున్నాడు.



లావణ్యతో మాట్లాడాలని నాయుడుగారి తోటలోకి రమ్మని ఫోన్ చేశాడు. ఆమె సంకోచించకుండా వచ్చింది.

"నీ భర్తకి విడాకులు ఇచ్చేయ్. మనం పెళ్లి చేసుకుందాం. నిన్ను మహారాణిలా చూసుకుంటాను." డైరక్టుగా విషయంలోకి వచ్చాడు.

"నీకు పిచ్చెక్కిందా" కోపంగా అడిగిందామె. "నేను మా ఆయనకి విడాకులు ఇవ్వాలా?"

"వాడు మనిషి కాడు ధనపిశాచి"

"అది ఇదివరకటి సంగతి. ఇప్పుడాయనలో చాలా మార్పు వచ్చింది. నన్ను ప్రేమగా చూసుకుంటున్నారు."

"నువ్వు తనపై పోలీసు కేసు పెట్టాక అతనిలో పరివర్తన వచ్చిందా?" అతని స్వరంలో వ్యంగ్యం

"ఎలాగైనా అనుకో! కాని అతనిపై నాకు పూర్తి నమ్మకం వుంది."

అతనామె వైపు కోరిక నిండిన కళ్లతో చూసాడు. ఆమె అందం అతని మతి పోగొడుతోంది. ఆమెని మరచిపోలేకే కదూ... ఆమె పెళ్లి చేసుకొని వెళ్లిపోయినా తను పెళ్లి చేసుకోకుండా వుండిపోయాడు. ఆమెకి తను దూరంగా వుండగలడా? "నాకు నువ్వు కావాలి. నువ్వు లేకపోతే నేను బతకను." అంటూ ఆమెను తన కౌగిలిలో బంధించబోయాడు.

"ఇడియెట్ నీకు పిచ్చెక్కిందిరా!" ఆమె ఛీత్కరించి అక్కడి నుంచి వెళ్లబోయింది. ప్రదీప్ ఆమెని ఒడిసి పట్టుకున్నాడు. ఆమెని బలాత్కరించాలనే కోరిక అతనిలో తీవ్రమవుతోంది. ఆమె అరిచి కేకలు వేసింది. ఆ అరుపులు విని ఎవరైనా అక్కడకొస్తే తను దోషిగా పట్టుపడవలసి వస్తుంది. అతను ఒంట్లోని శక్తినంతటిని చేతులలోకి తెచ్చుకొని ఆమె మెడ నులమడం ప్రారంభించాడు.

"నాకు దక్కని నిన్ను బతకనివ్వనే" అని బూతులు తిడుతూ...

కొద్దిసేపు అతని చేతులలో గిలగిలకొట్టుకుని ఆమె శరీరం అచేతనమై నేల మీదకి జారిపోయింది. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక, ఆమె శవాన్ని ఈడ్చుకుంటూ వెళ్లి పక్కనే వున్న ఏట్లోకి తోసేసాడు.

వంశీలో పరివర్తన బూటకమని, గతంలో ఆమెను కట్నం కోసం వేధించిన అతనే ఆమెని హత్య చేసాడని లేదా భర్త వేధింపులు పడలేక ఆమె ఆత్మహత్య చేసుకుందని లోకం నమ్ముతుందనుకున్నాడు. కానీ, దోషి ఎప్పటికైనా పట్టుపడక తప్పదని తెలుసుకోలేకపోయాడు.

★

**అతనామె వైపు కోరిక నిండిన కళ్లతో చూసాడు. ఆమె అందం అతని మతి పోగొడుతోంది. ఆమెని మరచిపోలేకే కదూ... ఆమె పెళ్లి చేసుకొని వెళ్లిపోయినా తను పెళ్లి చేసుకోకుండా వుండిపోయాడు. ఆమెకి తను దూరంగా వుండగలడా? "నాకు నువ్వు కావాలి. నువ్వు లేకపోతే నేను బతకను." అంటూ ఆమెను తన కౌగిలిలో బంధించబోయాడు.**